నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 8 జూన్ 2025 | HYDERABAD



బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో గ్రేటర్‌లోని పలు చోట్ల శనివారం తేలికపాటి జల్లులు కురిశాయి. టోలీచౌకిలో అత్యధికంగా 2.30 సెం.మీలు, బంజారాహిల్స్‌లో 1.60, ఫస్ట్‌లాన్సర్‌లో 1.35, విజయనగర్ కాలనీలో 1.25 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. -సిటీబ్యూరో



మచ్చ బొల్లారం డివిజన్ అల్వాల్ హిల్స్ సెయింట్ పాయిస్ స్కూల్ వద్ద రూ. 30.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అల్వాల్ హిల్స్ కాలనీ అసోసియేషన్ సభ్యులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసరావు, నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు డోలి రమేశ్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు. -మల్కాజిగిరి

# కొత్త బోగీలు లేనట్లే!

## పుణె కోచ్ ఫ్యాక్టరీకి ఆర్డర్ ఇస్తే.. ఏడాదికి మెట్రో బోగీలు

- ఇప్పటికీ ప్రతిపాదనలకే పరిమితం
- ఎల్ అండ్ టీ నాన్చుడు ధోరణి
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఇప్పట్లో తోపులాటలు, కిక్కిరిపోయిన జనాల నడుమ ప్రయాణాలు తప్పేలేవు. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా కొత్త బోగీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన మెట్రో నిర్వహణ సంస్థ ఎల్ అండ్ టీ ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు వేయలేదు. కనీసం ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేయకుండా జాప్యం చేస్తుండటంతో.. నగరవాసులకు మెట్రో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా అదనపు బోగీలను తీసుకోవాల్సి ఉన్నా.. అందుకు తగిన ప్రతిపాదనలు ఇంకా కార్యరూపంలోకి రాలేదు. దీంతో కొత్త బోగీల వ్యవహారంలో మెట్రో నిర్వహణ సంస్థ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తోంది. హైదరాబాద్ మెట్రోలో ప్రయాణించే వారి సంఖ్య నిత్యం పెరుగుతున్నా.. అందుకు సరిపడా బోగీలు లేవు. దీంతో మెట్రో రైళ్లన్నీ ప్రయాణికులతో పీక్ అవర్స్‌లో నిండిపోతున్నాయి. కిక్కిరిసిన జనంతో.. గమ్యస్థానాలకు చేర్చుతుందే తప్పా.. కొత్తగా బోగీలను ఏర్పాటు చేసి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయాలను కల్పించడంలో హైదరాబాద్ మెట్రో నిర్లక్ష్యం చేస్తోంది. నష్టాల పేరిట అదనపు బోగీల విషయాన్ని పక్కన పెడుతుండటంతో రద్దీ సమయంలో గంటల కొద్దీ స్టేషన్ల వద్ద ఎదురుచూడాల్సిన వస్తోంది. ఇలాంటి ఇబ్బందుల నేపథ్యంలో కొంతమంది ప్రత్యామ్నాయ మార్గాల్లో జర్నీ చేసే వారి సంఖ్య ఎక్కువే ఉంటుంది. సాధారణ సమయంలో ఖాళీగానే ఉన్నా.. ఉదయం 6-10గంటల మధ్య, సాయంత్రం 5-8గంటల మధ్య రద్దీ ఒక్కసారిగా పెరుగుతున్నది. ప్రస్తుతం ఉన్న మూడు బోగీలతో వెయ్యి మంది మాత్రమే ప్రయాణించే వీలు ఉంది. కానీ అంతకు మించి ప్లాట్‌ఫారం మీద ప్రయాణికులు చేరడంతో.. తర్వాతి ట్రైన్ కోసం ఎదురుచూస్తున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం ఇలాంటి ఇబ్బందులతో గమ్యస్థానాలకు మిగతా IIవ పేజీలో



# గ్రేటర్ బెర్త్ హుళక్కేనా

## మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని హైదరాబాద్

మళ్లీ మంత్రి వర్గ విస్తీర్ణం తెరమీదకు రావడంతో పదవి ఎవరిని వరిస్తుందోనని పార్టీ వర్గాల్లో జోరుగా చర్చలు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గ్రేటర్‌కు ఈసారైన మంత్రిపదవి దక్కుతుందా? లేదా? అనే చర్చ కూడా సాగుతున్నది. అయితే పార్టీ వర్గాల సమాచారం మేరకు ఈసారి కూడా గ్రేటర్ నాయకులకు మంత్రి పదవి దక్కడం కలగానే మిగిలిపోనున్నది. తాజా విస్తరణలోనూ గ్రేటర్‌కు మొండిచెయ్యేనంటున్నాయి పార్టీ వర్గాలు. రాష్ట్ర మంత్రిమండలిలో ప్రతి జిల్లాకు అందులో బెర్త్ ఉంటుంది. అందునా రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌కైతే సముచిత ప్రాధాన్యత ఉంటుంది. కానీ రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిన్నర గడిచినా గ్రేటర్‌కు మంత్రి పదవి కేటాయించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కాగా, కాంగ్రెస్ పార్టీకి గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం కనీసం ఒక్కటంటే ఒక్క నియోజకవర్గంలోనూ ప్రాతినిధ్యం లభించలేదు. కంటోన్మెంట్ నుంచి శ్రీగణేశ్ ఉప ఎన్నికలో గెలిచినా.. తొలిసారి ఎమ్మెల్యే గెలవడం వల్ల.. పార్టీ సీనియర్లు గ్రేటర్ కోటా మంత్రి పదవులపై కన్నేశారు. కానీ ఆ మేరకు వారి ప్రయత్నాలు సఫలం కాకపోతుండటంతో.. వారిని అంతే బలంగా ఓ ముఖ్యనేత అడ్డుకుంటున్నట్టు జోరుగా చర్చ సాగుతున్నది. ఇదిలా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఏడాదిన్నర గడిచినా గ్రేటర్‌లో ఒక్క అభివృద్ధి ప్రాజెక్టు రాకపోవడం బాధాకరమని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

- సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ)

**దశాబ్దాల చరిత్రలో నగరానికి అవకాశం లేకపోవడం ఇదే తొలిసారి**

- ఇద్దరు నేతలకు రాకుండా అడ్డుకుంటున్న ఓ ముఖ్యనేత
- తాజా విస్తరణలోనూ మొండిచెయ్యే అంటున్న పార్టీ వర్గాలు

ఉమ్మడి రాష్ట్రం నుంచి కేసీఆర్ పాలన వరకు ప్రతి ప్రభుత్వంలోనూ గ్రేటర్ హైదరాబాద్‌కు కీలక ప్రాధాన్యత ఉంటుందనేది రాజకీయ సత్యం. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన ప్రతి రాజకీయ పార్టీకి కనీసంగా ఒకటో, రెండు సీట్లతో రాజధాని ప్రాంతంలో ప్రాతినిధ్యం ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, టీడీపీలే కావడంతో కచ్చితంగా ఆ రెండు పార్టీలకు ప్రతిసారి కొన్ని స్థానాల్లో ఇక్కడ ప్రాతినిధ్యం దొరికేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సికింద్రాబాద్, మల్కాజిగిరి... రెండు స్థానాల్లో విజయం సాధించింది. 2018 ఎన్నికల్లో ఏకంగా పద్నాలుగు స్థానాల్లో బీఆర్ఎస్ విజయబావుటా ఎగురవేసింది. దీంతో ఈ రెండు సమయాల్లోనూ ప్రాతినిధ్యం వహిస్తున్న వారితో పాటు ఎమ్మెల్సీలుగా అవకాశం ఇచ్చి మరీ మంత్రివర్గంలో స్థానం కల్పించిన సందర్భాలు ఉన్నాయి. గ్రేటర్‌లో ఓడిన నాయకులకు ఎమ్మెల్సీలు కేటాయించి మంత్రి పదవి ఇస్తారని ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. ఆ లిస్టులో మిగతా IIవ పేజీలో




# కొండ నాలుకకు మందేస్తే!

## స్లాట్ ఒక రోజు.. సేవలు మరో రోజు • సారథి పోర్టల్‌తో వాహనదారులకు చేదు అనుభవం

## దేశవ్యాప్త సర్వర్ కావడంతో లోడు భారం • ప్రతీ అరగంటకోసారి సాంకేతిక ఇబ్బందులు

**సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ):**

కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు.. ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ తీసుకొచ్చిన వాహన్, సారథి పోర్టల్ వాహనదారుడికి చుక్కలు చూపిస్తున్నది. సరైన సమయంలో సేవలు అందక వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తున్నది. స్లాట్ బుక్ చేసుకున్న రోజు కాకుండా ఆ సేవలు మరుసటి రోజు పొందాల్సిన దుస్థితి సారథి పోర్టల్‌లో ఉంది. ప్రతీ అరగంటకో సారి సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ఏ రోజుకు ఆ రోజు సేవలు అందించాల్సిన అధికారులు.. పోర్టల్ పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### సిబ్బందితో వాగ్వాదం..

దేశ వ్యాప్తంగా వాహన్, సారథి పోర్టల్ నడుస్తున్నది. దీంతో సర్వర్‌పై లోడ్ భారం పడుతున్నది. అయితే ఈ మేరకు ఇక్కడి అధికారులు సాంకేతిక సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. 80 శాతం కంప్యూటర్ల ఓల్డ్ వెర్షన్‌తో కొనసాగుతున్నాయి. దీంతో సర్వర్‌పై భారం పడినప్పుడు ఈ కంప్యూటర్ల పనితీరు సరిగా ఉండటం లేదు. దీంతో సిబ్బంది మళ్లీ కంప్యూటర్లు లాగ్ అవుట్ లాగ్‌ఇన్ కావాల్సి వస్తున్నదని చెబుతున్నారు. మిగతా IVవ పేజీలో

### వాహనదారుల బెంబేలు..

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాహన్, సారథి పోర్టల్‌ను తీసుకురావాలని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రవేశపెట్టే ముందర సికింద్రాబాద్ ఆర్టీఓ కార్యాలయంలో పైలెట్ ప్రాజెక్టుగా సారథి పోర్టల్ సేవలు ప్రారంభించారు. పైలెట్ ప్రాజెక్టు కూడా పూర్తయింది. అయితే ఈ సేవలు పొందడానికి వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి ముందర వెళ్లినా.. ఆలస్యంగా వెళ్లినా స్లాట్ గడువు ముగిసినట్టు చూపిస్తున్నది. అంత సమయం ఆగుదామని వాహనదారులు ఆగినా.. అర గంటకోసారి ఏర్పడే సాంకేతిక సమస్యతో స్లాట్ సమయం దాటిపోతున్నది. దీంతో వాహనదారులు మళ్లీ స్లాట్ బుక్ చేసుకుని మరుసటి రోజు రావాల్సిన దుస్థితి ఉంది.





నగరంలో శనివారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మతపెద్దలు బక్రీద్ నేపథ్యాన్ని వివరించారు.

# ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెసోళ్లకేనా?

## అర్హుల ఎంపికపై అనేక సందేహాలు • హస్తం నేతల ఆదేశాలతోనే కేటాయింపు

**మేడ్చల్, జూన్7 (నమస్తే తెలంగాణ):**

ఇందిరమ్మ ఇంటి పథకంపై అర్హులు నమ్మకాన్ని కోల్పోతున్నారు. ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెసోళ్లకే కేటాయిస్తున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్లకు అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ పథకంలో ఇప్పటి వరకు 1, 284 మంది లబ్ధిదారులకు ఇండ్లను మంజూరు చేశారు. అయితే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రధానంగా కాంగ్రెస్ నాయకులనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని తేలిపోయింది. ఉదాహరణకు మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇంటి పథకానికి 216 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తే ఇందులో సుమారు 40 శాతం మంది కాంగ్రెస్ నాయకుల అనుచరులు, వారి బంధు మిత్రులకు ఇండ్లు కేటాయించడంలో అధికార పార్టీ నేతలు చక్రం తిప్పారని తెలుస్తోంది. ఈ విషయమై ఇందిరమ్మ మిగతా IVవ పేజీలో





**ట్రాఫికర్** | శనివారం ఏఐజీ మార్గంలో ట్రాఫిక్ రద్దీ

# పరిహారం మూడింతలైతే ఓకే?

- డిఫెన్స్ తరహాలో పరిహారం కావాలంటున్న బాధితులు
- ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు తొలగని భూ పరిహార సమస్యలు
- నేడు జేఏసీ మరోసారి సమావేశం

సిటీబ్యూరో, జూన్ 7(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూమి చిక్కులు తొలగడం లేదు. ఓవైపు రక్షణ శాఖ భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చినా.. పరిహారం తేలకపోవడంతో ఇంకా చర్చలు సాగుతున్నాయి. మరోవైపు ప్రైవేటు భూ బాధితులు కూడా ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ ప్రధాన డిమాండ్లను తమ ముందు ఉంచుతున్నారు. ముఖ్యంగా 200 ఫీట్ల వెడల్పు మేర ఆస్తులను సేకరించడం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, భూ పరిహారం విషయంలోనూ ఏటూ తేలడం లేదు. మూడింతలు ఇస్తే గానీ ప్రాజెక్టుకు ఆమోదించాలనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### మొదటి నుంచి అభ్యంతరం

ఎలివేటెడ్ కారిడార్ విషయంలో ఒక్క అడుగు ముందుకు, రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారుతున్నది. ముఖ్యంగా భూసేకరణ, పరిహారం, ప్రాజెక్టు వెడల్పు విషయంలో 18 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కోసం ఆందోళన చేస్తూనే ఉన్నారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలో నిర్మించనున్న ఎలివేటెడ్ కోసం విలువైన భూములను కోల్పోతున్నామని మొదటి నుంచి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రభుత్వం బాధితుల ఆవేదనను పట్టించుకోవడం లేదు. దీంతోనే మిగతా IVవ పేజీలో



# మందుబాబులు మారరా?

- జైలు శిక్షలు, జరిమానాలు వేసినా మార్పురావట్లే
- డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 1500 మంది
- అధిక శాతం ద్విచక్రవాహనదారులే
- మద్యం మత్తుతోనే 80 శాతం ప్రమాదాలు

II పేజీ



## ప్రాణం తీసిన సెల్‌ఫోన్ చార్జింగ్


# యువకుడి సజీవ దహనం

జగద్గిరిగుట్ట, జూన్ 7 : అగ్ని ప్రమాదంలో ఓ యువకుడు సజీవ దహనమయ్యాడు. జగద్గిరిగుట్ట పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. రింగ్‌బస్తీలో నివాసముండే సాయి (27) ప్రైవేటు ఉద్యోగి. అతడి తల్లిదండ్రులు శనివారం గుడికి వెళ్లగా సాయి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఈ క్రమంలోనే షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి.. సాయి మంటల్లో కాలిపోయాడు. తల్లిదండ్రులు వచ్చే సరికి గది అంతా పొగలతో నిండి ఉంది. స్థానికుల సాయంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా, అప్పటికే సాయి మృతి చెంది ఉన్నాడు. కాగా, సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టే క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి.. సాయి నిద్రిస్తున్న బెడ్‌కు మంటలు వ్యాపించినట్టు భావిస్తున్నారు. బాధితుడు తప్పించుకోలేక అక్కడే చనిపోయినట్టు తెలుస్తోంది.



మృతుడు సాయి(ఫైల్)

# గ్రేటర్‌లో కొత్త ఆటోలకు అనుమతి



సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ లోపల కొత్త ఆటోలకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ లోపల పరిమిత సంఖ్యలో ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీ ఆటో రిక్షాలకు అనుమతించింది. అందులో భాగంగా కొత్తగా 20వేల ఎలక్ట్రిక్ ఆటోలు, 10వేల ఎల్‌పీజీ ఆటోలు, 10వేల సీఎన్‌జీ ఆటోలకు అనుమతినిచ్చింది. డీజిల్, పెట్రోల్ వాహనాలకు సంబంధించి ఆటోలకు రెటిరోఫిట్మెంట్ చేసి వాటి ఇంజన్లను ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్‌పీజీలుగా మార్చుకునేందుకు 25 వేల ఆటోలకు అనుమతిస్తూ జీవో జారీ చేసింది.

# 24 బార్లకు 3,520 దరఖాస్తులు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో నోటిఫికేషన్ జారీచేసిన 24 బార్లకు 3,520 దరఖాస్తులు వచ్చినట్లు ఆబ్కారీ శాఖ కమిషనర్ హరికిరణ్ వెల్లడించారు. వీటితో పాటు ఇతర జిల్లాలోని నాలుగు బార్లకు 148 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మొత్తం 28 బార్లకు 3,668 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బార్లకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6తో ముగిసింది. దీంతో శుక్రవారం పెద్ద ఎత్తున మద్యం వ్యాపారులు బార్లకోసం దరఖాస్తు చేయడానికి ఆబ్కారీ కార్యాలయాల వద్ద బారులు తీరారు. జీహెచ్ఎంసీ మినహా ఇతర జిల్లాలైన రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలో నాలుగు బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. ఒక జీహెచ్ఎంసీ పరిధిలోనే 24 బార్లకు దరఖాస్తుల ద్వారా ఆబ్కారీ శాఖకు రూ.32.68కోట్ల ఆదాయం సమకూరగా, మొత్తం 28 బార్లకు రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఆబ్కారీ శాఖ వెల్లడించింది. ఈనెల 13న బార్లకు సంబంధించిన లక్కీడ్రా తీయనున్నట్లు కమిషనర్ తెలిపారు.